# నేటి నిజం

తెలుగు దినపత్రిక
website2:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433
E-mail : netinijam93@gmail.com
హైదరాబాద్ ఆదివారం 25-6-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 247 పేజీలు:6 వెల: రూ.1/-

## 30 నుంచి గిరిజనులకు పోడు పట్టాలు.. ఆసిఫాబాద్‌లో పంపిణీ చేయనున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, జూన్ 24:రాష్ట్రంలో గిరిజనులకు ఈ నెల 30 నుంచి గిరిజనులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో జరిగే కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొని, పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. మంత్రులు ఎమ్మెల్యేలు జిల్లాలు, నియోజకవర్గాల్లో అదే రోజు పోడు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్నారు.

ఈ నెల 24 నుంచే పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రకటించినప్పటికీ అనివార్య కారణాలతో ప్రభుత్వం ఈ నెల 30వ వాయిదా వేసింది. జాతీయ ఎన్నికల కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తుండడం, పర్యటనలో భాగంగా రెండురోజులుగా జిల్లా కలెక్టర్లకు శిక్షణాతరగుతులు నిర్వహిస్తున్నది. అదే సందర్భంలో ఈ నెల 29న బక్రీద్ పండుగ కూడా ఉండడం.. వీటన్నిటి నేపథ్యంలో ప్రకటించిన కార్యక్రమాన్ని జూన్ 30కి వాయిదా వేయాలని నిర్ణయించింది. ఆసిఫాబాద్ పర్యటన సీఎం కేసీఆర్ ఆసిఫాబాద్ కలెక్టరేట్, జిల్లా పోలీసుల ప్రధాన కార్యాలయాలకు ప్రారంభోత్సవం చేయనున్నారు.

## హైదరాబాద్‌లో విషాదం.. కుమారుడిని చంపి ఉరేసుకున్న తల్లి

హైదరాబాద్, జూన్ 24:ఓ మహిళ తన కుమారుడిని చంపి, అనంతరం ఆమె ఉరేసుకుంది. ఈ విషాద ఘటన హైదరాబాద్ నగరంలోని ఫిలింనగర్‌లో వెలుగు చూసింది.

వివరాల్లోకి వెళ్తే.. శిరీష(22) అనే మహిళకు నాలుగేండ్ల క్రితం విశ్వనాథ్ అనే వ్యక్తితో వివాహమైంది. ఈ దంపతులకు మూడేండ్ల వయసున్న కుమారుడు మనీష్ ఉన్నాడు. అయితే శుక్రవారం రాత్రి శిరీష తన కుమారుడికి ఇంట్లోనే ఉరేసింది. అదే ఇంట్లో శిరీష ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికీ తరలించారు.

అయితే భర్త, అత్తామామల వేధింపుల వల్లే శిరీష ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్ విస్తరణను ఆమోదించండి.. కేంద్రమంత్రిని కోరిన కేటీఆర్



న్యూఢిల్లీ, జూన్ 24: కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ హర్దీప్ సింగ్ పూరికి రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శ్శాఖ మంత్రి కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున పలు అంశాలకు సంబంధించి విజ్ఞప్తులు చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ రెండవ దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కేటీఆర్ కోరారు. లక్డీకాపూల్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు 26 కిలోమీటర్లు, నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు 5 కిలోమీటర్ల మెట్రో లైన్‌కు ఆమోదం తెలిపి, ఆర్థిక సహాయం చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మాదిరి పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా ఉపాధి హామీ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అమలులోకి తీసుకురావాలని మరొక ప్రతిపాదనను కేటీఆర్ సమర్పించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగర పరిధిలో చేపట్టిన లింకు రోడ్డుల కార్యక్రమాలు విజయవంతంగా నడుస్తున్నాయని ఇప్పటికే 22 మిస్సింగ్ లింక్ రోడ్లను పూర్తి చేశామని, మరో 17 రోడ్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని కేటీఆర్ తెలిపారు. ఇదేవిధంగా అవుటర్ రింగ్ రోడ్డు నుంచి పరిసర పురపాలికలకు మొత్తం 104 అదనపు కారిడార్లను నిర్మించేందుకు దాదాపు రూ. 2,400 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 800 కోట్లను ఈ ప్రాజెక్టు కోసం కేటాయించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముఖ్యంగా ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను శుద్ధి చేయడంతో పాటు చెత్తను తరలించేందుకు అవసరమైన వాహనాల ప్రోక్యూర్‌మెంట్ కోసం, ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల నిర్మాణం వంటి వివిధ కార్యక్రమాల కోసం స్వచ్ఛ భారత్ మిషన్ లేదా ఇతర కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కింద రూ. 400 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.

రూ. 3,050 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి 15 శాతం నిధులను కేంద్రం అందించాలని ఇందుకోసం రూ. 450 కోట్ల ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర పరిధిలో చేపడుతున్న ఎస్‌టీపీల నిర్మాణ ఖర్చు దాదాపు రూ. 3,722 కోట్లు అని ఇందులో కనీసం 20 శాతం రూ. 744 కోట్లను కేంద్ర ప్రభుత్వం అందించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిర్దేశించిన సిటిజన్ సెంట్రిక్ రిఫార్మ్స్ కింద బయో మైనింగ్, మానవ వ్యర్థాల శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను చేపట్టిందని వీటి అన్నింటి కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పురపాలికల్లో చేపడుతున్న కార్యక్రమాలకు మొత్తంగా రూ. 3,777 కోట్ల ఖర్చు అవుతుందని ఇందులో రూ. 750 కోట్లను కేంద్రం ఆర్థిక సాయం చేయాలన్నారు.

## బీహార్‌లో కూలిన నిర్మాణంలో ఉన్న వంతెన.. రెండు వారాల్లో రెండో సంఘటన

పాట్నా, జూన్ 24: బీహార్‌లో వరుసగా వంతెనలు కూలుతున్నాయి. తాజాగా నిర్మాణంలో ఉన్న మరో వంతెన కూలింది . రెండు వారాల్లో వంతెన కూలిన రెండో సంఘటన ఇది. బీహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాలో శనివారం ఈ సంఘటన జరిగింది. మెచ్చి నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జీ పిల్లర్ కూలినట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ అరవింద్ కుమార్ తెలిపారు.

ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు కోసం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

మానవ తప్పిదం వల్లనే నిర్మాణంలో ఉన్న వంతెన పిల్లర్ ఒరిగిపోయినట్లు తెలుస్తున్నదని అన్నారు. కిషన్‌గంజ్, కలిహార్‌ను అనుసంధానం చేసే ఈ వంతెనను మెచ్చి నదిపై నిర్మిస్తున్నట్లు చెప్పారు.

కాగా, జూన్ 4న బీహార్‌లోని ఖగారియా జిల్లాలో గంగా నదిపై నిర్మిస్తున్న వంతెన కుప్పకూలింది. ఖగారియా జిల్లాను భాగల్పూర్‌తో అనుసంధానించే ఆ వంతెన పేకముక్కలా పడిపోయింది. ఈ సంఘటనలో ఒక సెక్యూరిటీ గార్డు మరణించాడు. 2019 నవంబర్‌లో పూర్తి కావాల్సిన ఆ వంతెన నిర్మాణ పనులు మూడేళ్లకు పైగా కొనసాగడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సంఘటనపై బీహార్ ఇంజినీరింగ్ సర్వీసెస్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో పూర్తైన, నిర్మాణంలో ఉన్న అన్ని వంతెనలకు 'స్ట్రక్చరల్ ఆడిట్' నిర్వహించాలని డిమాండ్ చేసింది.

## ప్రతి ఒక్కరూ స్వచ్ఛ తెలంగాణకు సహకరించాలి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్, జూన్ 24:: ప్రతి ఒక్కరికీ స్వచ్ఛతపై అవగాహన ఉన్నప్పుడే రాష్ట్రం స్వచ్ఛ తెలంగాణగా రూపు దిద్దుకుంటుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీసీ రోడ్ల నిర్మాణం, జల్‌పల్లి కమాన్ వద్ద జల్‌పల్లి అర్బన్ ఫారెస్ట్‌లో చిల్డ్రన్ పార్కును, మన ఊరు-మన బడి కింద అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ ప్రాంతాలే కాకుండా పట్టణ ప్రగతికి కృషి చేస్తున్నారని వెల్లడించారు. ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో మహేశ్వరం నియోజకవర్గంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కోట్లాది రూపాయలతో అభివద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.

నియోజకవర్గానికి మెడికల్ కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ వసంత, డీఈ వెంకన్న, ఏఈ ఆయేషా, కో -ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈ జిల్లాలకు నేడు భారీ వర్ష సూచన..! ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ

హైదరాబాద్, జూన్ 24: రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసే సూచనలున్నాయని చెప్పింది. ఆదివారం నుంచి సోమవారం పలు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. ఈ మేరకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## నేటి అందుబాటులో సీపీగెట్-2023 హాల్ టికెట్లు

హైదరాబాద్ జూన్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణలోని 8 యూనివర్సిటీలతో పాటు అనుబంధ కాలేజీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం ఉస్మానియా యూనివర్సిటీ సీపీగెట్-2023 ప్రవేశ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి హాల్ టికెట్లను సీపీగెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. సీపీగెట్-2023కు మొత్తం 69,498 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 సెంటర్లలో సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎగ్జామ్ ప్రారంభానికి అర గంట ముందే అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సీపీగెట్ కన్వీనర్ సూచించారు. ఈ నెల 30 నుంచి జులై 10వ తేదీ వరకు ప్రతి రోజు మూడు సెషన్లలో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. తొలి సెషన్ ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2:30 గంటల వరకు, మూడో సెషన్ సాయంత్రం 4:30 నుంచి 6 గంటల వరకు నిర్వహించనున్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : మంత్రి తలసాని



హైదరాబాద్, జూన్ 24: తెలంగాణ ఆవిర్భావం తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం సనత్ నగర్ నియోజకవర్గంలోని పలు వార్డులలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. 50 సంవత్సరాల లో జరగని అభివృద్ధి 9 సంవత్సరాల లో జరిగిందని పేర్కొన్నారు.

ఈ నియోజక వర్గం నుంచి గెలిచి ముఖ్యమంత్రి, మంత్రులుగా పని చేసిన వారు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. అనేక దీర్ఘకాలిక ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో పరిష్కరించామని వెల్లడించారు. సుభాష్ నగర్‌లో ఎంతో మంది ప్రాణాలు బలిగొన్న హైటెన్షన్ విద్యుత్ లైన్ సమస్యను పరిష్కరించామని వివరించారు. అభివృద్ధికి ఎన్ని కోట్ల నిధులైనా మంజూరు చేయడానికి వెనుకాడబోమని పేర్కొన్నారు.

## రెచ్చిపోయిన చైన్ స్నాచర్లు

అమరావతి, జూన్ 24:కర్నూలు నగరంలో శనివారం చైన్ స్నాచర్స్ హల్ చల్ చేశారు. ఉదయం కర్నూలు నగరంలోని బుధవారపేట, కృష్ణానగర్, బాలాజీ నగర్?లలో ఇద్దరు దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి మహిళల మెడలో ఉన్న బంగారు గొలుసులను దొంగిలించేందుకు తెగబడ్డారు. బుధవారపేటలో ఇంటి ముందున్న ఓ మహిళ మెడలో ఐదు తులాల బంగారు గొలుసులు దుండగులు లాకెళ్ళారు. కృష్ణానగర్ వద్ద ఓ మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు లాగే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మహిళ కిందపడింది. అప్రమత్తమైన ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు వచ్చి దొంగలను పట్టుకునేందుకు వారి వెంటపడ్డారు. దొంగలు స్థానిక ప్రజలకు దొరక్కుండా బైక్ పై వేగంగా ప్రయాణించి తప్పించుకున్నారు.

ఇదే తరహాలో బాలాజీ నగర్?లో కూడా గొలుసు దొంగలు ఓ మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కెళ్లే ప్రయత్నం చేయగా.. మహిళ గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుండి పరారయ్యారు. వరుసగా చోటుచేసుకున్న ఈ ఘటనలపై కర్నూలు మూడవ పట్టణ, తాలూకా పోలీస్ స్టేషన్?లో కేసులు నమోదయ్యాయి. కర్నూలు నగరంలో ఒకేరోజు మూడు ప్రదేశాల్లో చైన్ స్నాచింగ్ జరగడంతో మహిళలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బ్రిస్బేన్ బోనాల పోస్టర్‌ను ఆవిష్కరించిన కవిత



హైదరాబాద్, జూన్ 24:ఆస్ట్రేలియా బ్రిస్బేన్‌లోని గాయత్రి మందిర్‌లో భారత జాగృతి ఆధ్వర్యంలో బోనాల వేడుకలను నిర్వహించనున్నారు. ఈ బోనాల పండుగకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈరోజు ఆవిష్కరించారు.


ఈ సందర్భంగా బిస్బేన్‌లోని ప్రవాసీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, భారత జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి, యువజన విభాగం అధ్యక్షుడు కోరబోయిన విజయ్, సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోదారి శ్రీను, లీగల్ సెల్ కన్వీనర్ తిరుపతి వర్మ, రాష్ట్ర కార్యదర్శి విక్రాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత జాగృతి ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమం జులై 15న ఉదయం 10 గంటలకు బ్రిస్బేన్ గాయత్రి మందిర్‌లో ప్రారంభం కానున్నాయి. కార్యక్రమానికి తెలంగాణ అసోసియేషన్, క్వీన్స్ ల్యాండ్ తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ అఫ్ గోల్డ్ కోస్ట్, ఇండియన్ కౌన్సిల్ అఫ్ ఆస్ట్రేలియా మద్దతు తెలిపాయి.

## తెలంగాణ శానిటేషన్ హబ్‌పై కేంద్ర మంత్రి ప్రశంసల వర్షం


న్యూఢిల్లీ, జూన్ 24:తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన శానిటేషన్ హబ్ కార్యక్రమంపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి ప్రశంసలు కురిపించారు. ఇలాంటి వినూత్నమైన ఆలోచనలతో కూడిన శానిటేషన్ హబ్ వల్ల పురపాలక అభివృద్ధిలో అనేక సవాళ్లకు సమాధానం దొరుకుతుందన్నారు. ఈ అంశం పైన తెలంగాణ రాష్ట్రం తన నమూనాను, ఆలోచనలను పంచుకోవాలని హర్దీప్ సింగ్ పూరి కోరారు. త్వరలోనే తన మంత్రిత్వ శాఖ ఢిల్లీలో ఏర్పాటు చేసే సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలతో కూడిన ప్రజెంటేషన్ ఇవ్వాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం పురపాలక శాఖ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఎస్ఆర్‌డీపీ, లింకు రోడ్లు, పారిశుద్ధ్య రంగంలో చేపట్టిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి అర్బన్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించేందుకు హైదరాబాద్ రావాలని కేంద్ర మంత్రిని కేటీఆర్ ఆహ్వానించారు.



### నేటి కందం- నేటికి అందం




(జూన్ 25 నావికుల దినోత్సవం,,)
(June 25 Day of the Sea Farers..)
-రాధశ్రీ
సెల్:9494481210

# 2030 నాటికి మానవాళి ఆకలిని తరిమేయగలమా..!

ఐక్యరాజ్యసమితి ప్రధాన శాఖలైన ప్రపంచ ఆహార సంస్థ (యఫ్ఏఓ), యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐయఫ్ఏడి), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూయఫ్‌పి)లు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల ఆధారంగా నివేదికను విడుదల చేశారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో(యస్‌డిజి) భాగంగా 2030 నాటికి ప్రపంచంలో ఆకలి చావులు, పోషకాహార లోపం లేకుండా చూస్తూ, 'జీరో హంగర్ (ఆకలి లేని లోకం)' సాధించాలనే ఉన్నత, ఉత్తమ నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచంలో పోషకాహారలోపం అత్యధికంగా ఆసియా దేశాల్లో 418 మిలియన్లు ఉండగా, ఆఫ్రికాలో 282 మిలియన్లు ఉన్నారని తెలుస్తున్నది. ప్రత్యేక చర్యలు అమలు పరచని యెడల 2030 నాటికి 660 మిలియన్ల పేదలు ఉంటారని, ఆకలిని అంతం చేయడం అసాధ్యమని తెలుస్తున్నది. కరోనా మహమ్మారి విజృంభనతో అదనంగా 30 మిలియన్ల పేదలు ఆకలితో అలమటించారని తున్నారని అర్థం అవుతున్నది.

## పోషకాహార అభద్రత సంక్షోభం:

ప్రపంచవ్యాప్తంగా 237 కోట్లకు పైగా (ప్రతి ముగ్గురిలో ఒకరు) ప్రజలకు అవసరమైనంత ఆహారం లభించడం లేదని నివేదిక తెలుపుతున్నది. లింగ వివక్ష కారణంగా పురుషుల కన్న మహిళల్లో 10 శాతం అధికంగా ఆహార అభద్రత అనుభవిస్తున్నారు. ఆహార ధాన్యాల అధిక ధరలు, ఆదాయం తగ్గడం వల్ల 300 కోట్ల పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహారలోపం ప్రపంచ మానవాళికి శాపంగా వెంటాడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 22 శాతం (150 కోట్లు) ఐదేండ్ల లోపు పిల్లలు శరీర వృద్ధి నిలిచిపోవడం (స్టంటింగ్)తో, 6.7 శాతం (4.54 కోట్లు) అభివృద్ధి తగ్గడం (వేస్టింగ్)తో, 5.7 శాతం (3.89 కోట్లు) అధిక బరువు (ఓవర్ వేయిట్) సమస్యలతో బాధ పడుతున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పిల్లల పోషకాహారలోపం అత్యధికంగా కనిపిస్తున్నది. ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల్లో 15-49 ఏండ్ల మహిళల్లో 30 శాతం రక్తహీనత (ఎనీమియా) సమస్య కనిపించగా, అమెరికా, యురొప్‌లో 14.6 శాతం మాత్రమే నమోదు అయ్యింది. గర్భిణి మహిళల్లో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల మందగించడం, తల్లిపాల లభ్యత పడిపోవడం, తక్కువ బరువుతో శిశు జననాలు, ఓవర్ వేయిట్ పిల్లలు పెరగడం, వయోజనుల్లో స్థూలకాయం లాంటి సమస్యల మధ్య 2030 నాటికి ఆకలిని అంతం చేయడం అసాధ్యమని వివరించారు.

## ప్రతికూల వాతావరణ మార్పుల ప్రభావం:

ఆహార అభద్రత, పోషకాహారలోపం పెరగడానికి కారణాలుగా వాతావరణ అసాధారణ ప్రతికూల మార్పులు, ఆర్థిక మందగమనం, ఆర్థిక అసమానతలు, లాక్‌డౌన్/కర్ఫ్యూలు లాంటి అంశాలు పేర్కొనబడినవి. ఆహార ధాన్యాల దిగుబడి తగ్గడం, మార్కెటింగ్ శృంఖలంలో లోసుగులు (ఉత్పత్తి, పంట కోత, ప్రాసెసింగ్, రవాణ, మార్కెటింగ్, సరైన ధర పలకడం), ఆదాయాలు తగ్గడంతో పోషకాహారానికి పేదలు దూరం అవుతున్నారు. పోషకాహార ఆహార లభ్యత పెరగడానికి కారణాలుగా మానవీయతను పోషిస్తూ శాంతి స్థాపనలు, వాతావరణ ఒడుదుడుకులను తట్టుకోగల ఆహార వ్యవస్థలు, ఆర్థిక కష్టాలను అధిగమించడం, ఆహార సరఫరా శృంఖలంలో నాణ్యతను పరిరక్షించడం, పేదరికంతో పాటు అసమానతలను తొలగించడం, పోషకాహారం పట్ల ఆరోగ్య అవగాహన కల్పించడం లాంటి అంశాలు పేర్కొనబడినవి. ఆర్థిక అసమానతలు పెరిగితే ప్రకృతి సహజ వనరులైన సారవంతమైన నేలలు, మత్స్యసంపద, అటవీ సంపద, నీటి వనరుల కోసం సంఘర్షణలు కలగడం సర్వసాధారణమని నమ్మాలి. సమాజంలో ఆదాయం, ఉత్పత్తి సామర్థ్యం, ఆస్తులు, టెక్నాలజీ, విద్య, ఆరోగ్య రంగాల్లో అసమానతలు పెరిగితే వాటి దుష్ప్రభావానికి అధికంగా మహిళలు, పిల్లలపై నేరుగా పడుతుంది.

ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి వినియోగం వరకు ఇమిడి ఉన్న పలు దశల్లో ఆహారం వ్యర్థం కావడం నేర సమానమని నమ్మాలి. ఆహారాన్ని ఆదా చేస్తే ఆహారం ఉత్పత్తి చేసిన దాని కన్న మిన్న అని తెలుసుకోవాలి. 'యుయన్ ఫుడ్ సిస్టమ్స్ సమిట్' సూచనల ప్రకారం ప్రపంచ దేశాలు తమదైన చర్యలను తీసుకుంటూ 2030 నాటికి 'జీరో హంగర్' దిశగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన ఆహార అభద్రత (యస్‌డిజి టార్గెట్-2.1), పోషకాహారలోపాలను (యస్‌డిజి టార్గెట్-2.2) అధిగమించి, అనుకున్న సదుద్దేశ్యాలను సగర్వంగా చేరుకోవాలని ఆశిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# టైమ్ ఆఫ్ డే (టిఒడి) టారిఫ్ మరియు స్మార్ట్ మీటరింగ్ నియమాలను సరళీకృతం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ నిబంధనలను సవరించింది.

న్యూఢిల్లీ, జూన్ 24:విద్యుత్ (వినియోగదారుల హక్కులు) నియమాలు, 2020కి సవరణ చేయడం ద్వారా భారత ప్రభుత్వం ప్రస్తుత విద్యుత్ టారిఫ్ వ్యవస్థకు రెండు మార్పులను ప్రవేశపెట్టింది. మార్పులు: టైమ్ ఆఫ్ డే (టిఒడి) టారిఫ్‌ను ప్రవేశపెట్టడం మరియు స్మార్ట్ మీటరింగ్ నిబంధనలను హేతుబద్ధీకరించడం.

రోజులో అన్ని సమయాల్లో ఒకే రేటుతో విద్యుత్ ఛార్జీ విధించే బదులు విద్యుత్ కోసం చెల్లించే ధర రోజులో సమయాన్ని బట్టి మారుతుంది. టిఒడి టారిఫ్ విధానంలో సౌర గంటలలో సుంకం (రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంఘం ద్వారా నిర్దేశించబడిన రోజులో ఎనిమిది గంటల వ్యవధి) సాధారణ టారిఫ్ కంటే 10%-20% తక్కువగా ఉంటుంది, అయితే పీక్ అవర్స్‌లో సుంకం ఉంటుంది 10 నుంచి 20 శాతం ఎక్కువగా ఉంటుంది. టిఒడి టారిఫ్ గరిష్టంగా 10 కెడబ్ల్యూ మరియు అంతకంటే ఎక్కువ డిమాండ్ ఉన్న వాణిజ్య మరియు పారిశ్రామిక వినియోగదారులకు, 1 ఏప్రిల్, 2024 నుండి మరియు వ్యవసాయ వినియోగదారులకు మినహా మిగిలిన వినియోగదారులందరికీ, 1 ఏప్రిల్, 2025 నుండి వర్తిస్తుంది. స్మార్ట్ మీటర్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన వెంటనే రోజు టారిఫ్ అమలులోకి వస్తుంది.

కేంద్ర విద్యుత్ మరియు నూతన ఉ పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీ ఆర్. కె. సింగ్ మాట్లాడుతూ టిడి వినియోగదారులతో పాటు విద్యుత్ వ్యవస్థకు ఇది ఉభయ తారకం అని అన్నారు. " పీక్ అవర్స్, సోలార్ అవర్స్ మరియు సాధారణ గంటల కోసం ప్రత్యేక టారిఫ్‌లతో కూడిన టిఒడి టారిఫ్‌లు, టారిఫ్ ప్రకారం తమ లోడ్‌ను నిర్వహించడానికి వినియోగదారులకు ధర సంకేతాలను పంపుతాయి. టిఒడి టారిఫ్ మెకానిజంపై అవగాహన మరియు సమర్థవంతమైన వినియోగంతో వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చు. సౌర విద్యుత్తు చౌకైనందున, సౌర గంటలలో సుంకం తక్కువగా ఉంటుంది, తద్వారా వినియోగదారు ప్రయోజనం పొందుతారు. సౌర శక్తి లేని సమయాల్లో థర్మల్ మరియు హైడ్రో పవర్ అలాగే గ్యాస్ ఆధారిత సామర్థ్యం ఉపయోగించబడుతుంది - వాటి ఖర్చులు సౌర శక్తి కంటే ఎక్కువగా ఉంటాయి - ఇది టైమ్ ఆఫ్ డే టారిఫ్‌లో ప్రతిబింబిస్తుంది. ఇప్పుడు వినియోగదారులు తమ విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడానికి తమ వినియోగాన్ని ప్లాన్ చేసుకోవచ్చు - విద్యుత్ ఖర్చులు తక్కువగా ఉన్నప్పుడు సౌర గంటలలో మరిన్ని కార్యకలాపాలను ప్లాన్ చేసుకోవచ్చు.

పునరుత్పాదక ఇంధన వనరుల మెరుగైన గ్రిడ్ ఏకీకరణను కూడా టీఓడీ యంత్రాంగం నిర్ధారిస్తుంది, తద్వారా భారతదేశానికి వేగవంతమైన ఇంధన పరివర్తనను సులభతరం చేస్తుందని కేంద్ర మంత్రి చెప్పారు. "టిఒడి టారిఫ్ పునరుత్పాదక ఉత్పత్తి హెచ్చుతగ్గుల నిర్వహణను మెరుగుపరుస్తుంది, అధిక ఆర్ఈ ఉత్పత్తి సమయాలలో డిమాండ్ పెరుగుదలను ప్రోత్సహిస్తుంది మరియు తద్వారా పెద్ద మొత్తంలో పునరుత్పాదక శక్తి యొక్క గ్రిడ్ ఏకీకరణను పెంచుతుంది" అని శ్రీ ఆర్. కె. సింగ్ చెప్పారు.

దేశంలోని భారీ వాణిజ్య మరియు పారిశ్రామిక (సిఅండ్ఐ) కేటగిరీ వినియోగదారుల కోసం చాలా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్‌లు (ఎస్ఈఆర్‌సిలు) ఇప్పటికే టిఒడి టారిఫ్‌లను అమలు చేస్తున్నాయి. స్మార్ట్ మీటర్ల ఇన్‌స్టాలేషన్‌తో టారిఫ్ పాలసీ ఆదేశం ప్రకారం దేశీయ వినియోగదారుల స్థాయిలో టిఒడి మీటరింగ్ ప్రవేశపెట్టబడుతుంది.

టైమ్ ఆఫ్ డే (టిఒడి) టారిఫ్, విద్యుత్ పరిశ్రమల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడింది, ఇది ఒక ముఖ్యమైన డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్ (డిఎస్ఎం) కొలతగా వినియోగదారులను వారి లోడ్‌లలో కొంత భాగాన్ని పీక్ టైమ్‌ల నుండి ఆఫ్-పీక్ టైమ్‌లకు మార్చడానికి ప్రోత్సహించే సాధనంగా ఉపయోగించబడుతుంది, తద్వారా పీక్ పీరియడ్‌లో సిస్టమ్‌పై డిమాండ్‌ని తగ్గించడం ద్వారా సిస్టమ్ లోడ్ ఫ్యాక్టర్‌ను మెరుగుపరుస్తుంది. టిఒడి టారిఫ్ (అంటే టారిఫ్ పాలసీ, 2016, ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2003 మరియు నేషనల్ ఎలక్ట్రిసిటీ పాలసీ, 2005) అమలును ప్రారంభించడానికి మరియు ప్రోత్సహించడానికి వివిధ చట్టబద్ధమైన నిబంధనలు ఇప్పటికే ఉన్నాయి.

స్మార్ట్ మీటరింగ్ నిబంధనలను కూడా ప్రభుత్వం సరళతరం చేసింది. వినియోగదారులకు అసౌకర్యం / వేధింపులను నివారించడానికి, గరిష్టంగా మంజూరైన లోడ్ / డిమాండ్‌కు మించి వినియోగదారుడి డిమాండ్‌ను పెంచినందుకు ప్రస్తుతం ఉన్న జరిమానాలు తగ్గించబడ్డాయి. మీటరింగ్ నిబంధనలో సవరణ ప్రకారం, స్మార్ట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేసిన తర్వాత, ఇన్‌స్టాలేషన్ తేదీకి ముందు కాలానికి స్మార్ట్ మీటర్ నమోదు చేసిన గరిష్ట డిమాండ్ ఆధారంగా వినియోగదారుపై ఎటువంటి జరిమానా ఛార్జీలు విధించబడవు. ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం మూడు సార్లు మంజూరైన లోడ్‌ను అధిగమించినట్లయితే మాత్రమే గరిష్ట డిమాండ్ పైకి సవరించబడే విధంగా లోడ్ రివిజన్ విధానం కూడా హేతుబద్ధీకరించబడింది. అంతేకాకుండా, స్మార్ట్ మీటర్‌లను కనీసం రోజుకు ఒకసారి రిమోట్‌గా చదవాలి మరియు విద్యుత్ వినియోగం గురించి సమాచారం తీసుకునే నిర్ణయం తీసుకునేలా వినియోగదారులతో డేటాను షేర్ చేయాలి.

విద్యుత్ (వినియోగదారుల హక్కులు) రూల్స్, 2020ని ప్రభుత్వం డిసెంబర్ 31, 2020న పవర్ సిస్టమ్ అనే నమ్మకం ఆధారంగా నోటిఫై చేసింది. వినియోగదారులకు సేవ చేయడానికి ఇఎంఎస్ ఉనికిలో ఉంది మరియు వినియోగదారులకు నమ్మకమైన సేవలు మరియు నాణ్యమైన విద్యుత్తును పొందే హక్కులు ఉన్నాయి. కొత్త విద్యుత్ కనెక్షన్లు, రీఫండ్‌లు మరియు ఇతర సేవలను సమయానుకూలంగా అందించాలని మరియు వినియోగదారుల హక్కులను ఉద్దేశపూర్వకంగా విస్మరించడం వల్ల సర్వీస్ ప్రొవైడర్లపై జరిమానాలు విధించడం మరియు వినియోగదారులకు పరిహారం చెల్లింపు జరిగేలా నిబంధనలు కోరుతున్నాయి.

ప్రస్తుత నిబంధనల సవరణ, విద్యుత్ వినియోగదారులకు సాధికారత కల్పించడం, అందుబాటు ధరలో 24చీ7 నమ్మకమైన విద్యుత్ సరఫరాను నిర్ధారించడం మరియు విద్యుత్ రంగంలో పెట్టుబడులకు అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను నిర్వహించడం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యల కొనసాగింపు ఉంటుంది.

# రూ.2కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం.. 9మంది స్మగ్లర్ల అరెస్ట్



తిరుపతి, జూన్ 24:: రెండు కోట్ల రూపాయుల విలువ గల ఎర్రచందనం అక్రమ రవాణా చేసి తీసుకొని వెళుతుండగా ఎల్లమంద ఉస్తికాయల పెంట రోడ్ లో గల ఎల్లమంద క్రాస్ వద్ద వాహనాలను సీజ్ చేసి, వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ? పోలీసులను చూసి అప్రమత్తమైన స్మగ్లర్లను వెంటాడి ఎల్లమంద క్రాస్ వద్ద పట్టుకోవడం జరిగిందని వివరించారు. చాకచక్యంగా ఆ వ్యక్తులపై దాడి చేసి తొమ్మిది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు మూడు ఇన్నోవా కార్లు, ఒక హోండా కారు, ఒక బొలెరో పికఅఫ్ వాహనం, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని వివరించారు.

అలాగే వీటితోపాటు 33 ఎర్రచందనం దునీగలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించామన్నారు. వీరిపై పీడీయాక్ట్ కేసులను నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం సరిహద్దు చెక్ పోస్టుల యందు ఇదివరకే సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు వాహనాలు తనిఖీ కార్యక్రమం చేస్తూ కట్టడి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. జాతీయ సంపద అరుదైన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అక్రమ రవాణా చేసినా, సహకరించినా శిక్షకు అర్హులే అని వివరించారు. పట్టుబడిన వారు సరుకును శేషాచల అటవీ ప్రాంతం నుండి వేలూరుకు పంపిస్తున్నట్లు తెలిసిందన్నారు. అలాగే వీరు రెండు వేరువేరు ముఠాలకు చెందినవారు ఈ తరలింపు కోసం కలిసి పనిచేసినట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకట్రావు, చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్, భాకరాపేట సీఐ తులసి రామ్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, ప్రకాష్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కారు బోల్తా.. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి తప్పిన ప్రమాదం

హైదరాబాద్, జూన్ 24:కారు బోల్తాపడి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి తృటిలో పెద్ద ప్రమాదం తప్పిన ఘటన కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపిలో చోటుచేసుకుంది. ఆయన ప్రమాణిస్తున్న కారు టైరు పేలడంతో, వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది.

దీనిపై సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

వివరాలిలా ఉన్నాయి. ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి శనివారం మంగళూరు నుంచి శృంగేరి వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు ఉడిపి జిల్లా కర్కల తాలూకాలోని మియారు బ్రిడ్జి సమీపంలోని నల్లూరు క్రాస్ ముదారు ప్రాంతంలోకి చేరుకోగానే టైరు పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనపై స్థానిక కర్కల పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే అక్కడికి చేరుకున్నారు. అయితే ఈప్రమాదంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి క్షేమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మంగళవారం విజ్ఞాన్ భవన్‌లో 'ఔత్సాహిక భారతదేశం - ఎంఎస్ఎంఈ దే'

న్యూఢిల్లీ, జూన్ 24:న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో 2023 జూన్ 27న అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవం కార్యక్రమం జరగనున్నది. "ఔత్సాహిక భారతదేశం" పేరిట ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. కార్యక్రమానికి కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి శ్రీ నారాయణ్ రాణే ముఖ్య అతిథిగా, కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ సహాయ మంత్రి శ్రీ భాను ప్రతాప్ సింగ్ వర్మ గౌరవ అతిథిగా హాజరవుతారు.

కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఎంఎస్ఎంఈ అభివృద్ధికి ఛాంపియన్స్ 2.0 పోర్టల్ క్లస్టర్ ప్రాజెక్ట్‌లు, సాంకేతిక కేంద్రాల జియో-ట్యాగింగ్ కోసం మొబైల్ యాప్ వంటి వివిధ కార్యక్రమాలను ప్రారంభిస్తుంది. ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 2.0' ఫలితాలు ప్రకటిస్తారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం 'ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 3.0' ను ప్రారంభిస్తారు. అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవం సందర్భంగా గోల్డ్ సిల్వర్ జెడ్ గుర్తింపు పొందిన ఎంఎస్ఎంఈ లకు సర్టిఫికెట్ అందజేస్తారు. 10,075మంది పీఎంఈజీపీ లబ్ధిదారులకు సబ్సిడీగా 400 కోట్ల రూపాయలు అందిస్తారు. ఎంఎస్ఎంఈ లకు సంబంధించి వివిధ ప్రభుత్వ సంస్థల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరుగుతాయి.

ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ తన పథకాలు , కార్యక్రమాల ద్వారా ఎంఎస్ఎంఈ లకు వ్యాపార అవకాశాలు మెరుగుపరచడం, కొత్త ఉత్పత్తులు, సేవల ఆవిష్కరణ, అభివృద్ధి ప్రోత్సహించడం, ప్రాంతీయ స్థాయిలో అభివృద్ధిని ప్రోత్సహించి ప్రాంతీయ అసమానతలు తొలగించడానికి కృషి చేస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ అవకాశాలు కల్పించడానికి కార్యక్రమాలు అమలు చేస్తున్న మంత్రిత్వ శాఖ ఎంఎస్ఎంఈ ల అభివృద్ధికి కార్యక్రమాలు అమలు చేస్తూ ఉపాధి అవకాశాలు కల్పించడానికి, దేశవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ ల ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంపొందించడానికి మంత్రిత్వ శాఖ ప్రాధాన్యత ఇస్తోంది.

# తమ 61వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకున్న ఎంఒఐఎల్

న్యూఢిల్లీ, జూన్ 24: తన 61వ వ్యవస్థాపక దినోత్సవాన్ని 22 జూన్ 2023న జరుపుకొని ఎంఒఐఎల్ ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. మహత్వపూర్ణమైన ఈ సందర్భానికి భారత ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ నాగేంద్రనాథ్ సిన్హా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎంఒఐఎల్ అభినందించి, ఉత్పత్తిని పెంచవలసిందిగా ఉద్బోధించారు.

గత కొద్ది నెలల్లో కంపెనీ ఉల్లాస, ఉత్సాహభరితమైన పనితీరును పట్టి చూపుతూ, ఆర్థిక సంవత్సరం 24లో రికార్డు పనితీరును నమోదు చేయగల మనే విశ్వాసాన్ని ఎంఒఐఎల్ సిఎండి శ్రీ ఎ.కె. సక్సేనా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు పలు పత్రికలను, మాన్యువళ్ళను విడుదల చేశారు.

ప్రముఖ ప్రదర్శకులు శ్రీ పవన్‌దీప్ రంజన్ ఉ అరుణిత కంజిలాల్ ( ఇండియన్ ఐడల్ 12 విజేతలు)తో భారీ సంగీత కార్యక్రమాన్ని, స్టాండప్ హాస్యనటుడు శ్రీ గౌరవ్ వర్మతో కార్యక్రమాలను నిర్వహించారు. కంపెనీ వ్యాప్తంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించిన క్రమంలో, వివిధ మైన్లకు చెందిన విజేత బృందాలు ఈ సందర్భంగా తమ ప్రదర్శనలు ఇచ్చారు.

, ఆర్థిక సంవత్సరం 24లో మొత్తం 60,000ల మొక్కలను నాటడం, రక్తదాన శిబిరాలు, వైద్య ఉ హృద్రోగ నిర్ధారణకు శిబిరాలు, ఎంఒఐఎల్ గనుల వ్యాప్తంగా సాంస్కృతిక కార్యక్రమాలు సహా పలు కార్యక్రమాలను 61వ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా నిర్వహించారు.

# యుఎస్ఏ అధ్యక్షునితో ప్రధాన మంత్రి సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 24:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ యుఎస్ఏలో అధికారిక పర్యటన లో నిమగ్నమై ఉన్నారు. ఆయన ఈ రోజు న ఉదయం పూట వైట్ హౌస్ ను సందర్శించారు. అక్కడ అధ్యక్షుడు శ్రీ జోసెఫ్ బైడెన్ మరియు ప్రథమ మహిళ డాక్టర్ జిల్ బైడెన్ గారు లు ఆయన కు సంప్రదాయబద్ధ స్వాగతం పలికారు. ఈ సందర్భం లో ప్రధాన మంత్రి కి స్వాగతం పలికేందుకు భారతీయ మూలాలు కలిగిన అమెరికన్ లు వేల సంఖ్య లో తరలివచ్చారు. ప్రధాన మంత్రి తదనంతరం, అధ్యక్షుడు శ్రీ బైడెన్ తో కలసి పరిమిత మరియు ప్రతినిధి వర్గం స్థాయి సమావేశాల లో ఉపయోగకరమైన చర్చ లో పాల్గొన్నారు. నేతలు ఇద్దరూ రెండు దేశాల మధ్య దీర్ఘకాలం గా కొనసాగుతూ వస్తున్న మైత్రి, వ్యాపారం మరియు పెట్టుబడి, రక్షణ, శక్తి, జలవాయు పరివర్తన మొదలుకొని ఉభయ దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు వంటి రంగాల వరకు విస్తరిస్తున్న సహకారాన్ని గురించి చర్చించారు.

ఇరువురు నేత లు సంబంధాల ను ఒక నూతన శిఖరానికి చేర్చడ కోసం ఒక బలమైనటువంటి ప్రాతిపదిక ను అందించేటటువంటి ఉభయ దేశాల మధ్య గల పరస్పర విశ్వాసం మరియు అవగాహనల తో పాటు ఉమ్మడి విలువల ను గురించి కూడా చర్చించారు. వారు క్రిటికల్ ఎండ్ ఇమర్జింగ్ టెక్నాలజీ స్ (ఐసిఇటి) వంటి కార్యక్రమాల మాధ్యం ద్వారా శ్రీఘ్ర పురోగతి చోటుచేసుకొంటూ ఉండడాన్ని మరియు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా సరే వాటి ని తట్టుకొని నిలబడగ˜లిగేటటువంటి సరఫరా వ్యవస్థల ను నిర్మించడం కోసం వ్యూహాత్మకమైన సాంకేతిక విజ్ఞాన సంబంధి సహకారాన్ని పెంపొందించుకోవాలన్న ప్రగాఢమైన అభిలాష పట్ల ప్రశంస ను వ్యక్తపరచారు. వారు మహత్వపూర్ణ ఖనిజాలు మరియు అంతరిక్ష రంగం లలో సహకారం పెంపొందుతూ ఉండడాన్ని స్వాగతించారు. జలవాయు పరివర్తన ను ఎదుర్కోవాలన్న మరియు ఒక స్థిరమైనటువంటి భవిష్యత్తు సాధన సంబంధి లక్ష్యాన్ని దక్కించుకోవడం కోసం తమ వచనబద్ధత ను ఇద్దరు నేతలు పునరుద్ఘాటించారు. వారు స్వచ్ఛమైనటువంటి మరియు అక్షయమైనటువంటి శక్తి ని పెంపొందింప చేయగల మార్గాల ను గురించి మరియు జలవాయు కార్యక్రమం లో సహకరించుకోగల మార్గాల ను గురించి చర్చించారు.

నేతలు ఇద్దరు వారి వారి ప్రజానీకాని కి మరియు ప్రపంచ సముదాయాని కి కూడా హితకరం అయ్యేలా భారతదేశం, ఇంకా యుఎస్ఏ ల మధ్య బహుముఖీన మైన విస్తృత ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత గాఢం గా మలచాలన్న దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ చర్చల లో పరస్పర హితం ముడిపడిన ప్రాంతీయ అంశాలు మరియు ప్రపంచ అంశాలు కూడా ప్రస్తావన కు వచ్చాయి.

అధ్యక్షుడు శ్రీ జో బైడెన్ మరియు ప్రథమ మహిళ గారు లు తనకు అందించినటువంటి స్నేహపూర్ణ స్వాగతాని కి గాను ప్రధాన మంత్రి వారిని ప్రశంసించారు. 2023 వ సంవత్సరం సెప్టెంబరు లో జి20 దేశాల నేతల శిఖర సమ్మేళనం జరిగే సందర్భం లో న్యూఢిల్లీ లో అధ్యక్షుడు శ్రీ బైడెన్ కు స్వాగతం పలకాలని ఉంది అంటూ ప్రధాన మంత్రి తన ఉత్సుకత ను వ్యక్తం చేశారు.

# తిరుమలలో చిక్కిన చిరుత

తిరుపతి, జూన్ 24:తిరుమలలో నాలుగేళ్ల చిన్నారిపై దాడి చేసిన చిరుతపులిని అటవీ అధికారులు పట్టుకున్నారు. గత రాత్రి 10.45కి ఈ చిరుతపులి బోనులో చిక్కింది. మొన్న అలిపిరి కాలినడక మార్గంలో ఈ చిరుతపులి నాలుగేళ్ల చిన్నారిపై దాడి చేసింది.

మెడ కొరికింది. ఆ తర్వాత చిన్నారిని ఆస్పత్రికి తరలించి కాపాడారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ అధికారులు. నిన్న సాయంత్రం 2 బోన్లను ఏర్పాటు చేశారు. ఈ చిరుతపులి రాత్రి 10 తర్వాత బోనులోకి చిక్కినట్లు అటవీ అధికారులు కనిపెట్టారు.

ఐతే.. ఈ చిరుతపులి మగ అని,.. అసలు దీనికి వేటాడటమే రాదని అధికారులు తేల్చారు.

ఈ చిరుతపులి వయసు ఒకటిన్నర సంవత్సరం ఉంటుందని అధికారులు తెలిపారు. మొన్న అలిపిరి మార్గంలో ఓ పిల్లిని పట్టుకునేందుకు ఈ చిరుతపులి ప్రయత్నించి.. ఆ క్రమంలో పిల్లి బదులు పిల్లాణ్ని పట్టుకుందనీ? అందుకే మెడను పట్టుకుందని అధికారులు తెలిపారు.


ఈ చిరుతపులి ఈమధ్యే తల్లి నుంచి వేరైందనీ. 2 రోజులుగా ఆహారం లేక అలమటిస్తూ పిల్లి అనుకొని పిల్లాడిపై దాడి చేసినట్లుందని అధికారులు తెలిపారు.

# జ్ఞానాన్ని మించిన సంపద లేదు

**-పట్టుదల అంకితభావంతో చదువుకుంటే ఉన్నత అధిరోహించవచ్చు**
**-ఎన్.హెచ్.ఆర్. డబ్ల్యూ.సి.పి.సి జాతీయ చైర్మన్ అనంతుల శ్రీనివాస్**



హైదరాబాద్ జూన్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నేషనల్ హ్యూమాన్ రైట్స్ - ఉమెన్ ఉ చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిల్ మూడోవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బోరబండ లోని తెలంగాణా గురుకుల పాఠశాలలో బాలికలకు నోటుబుక్స్ పంపిణీచేశారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ అనంతుల శ్రీనివాస్ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ దాదాపుగా సామాన్య మధ్యతరగతికి చెందినవారికి మెరుగైన విద్యను అందించాలన్న మంచి ఉద్దేశ్యంతో ప్రభుత్వం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసిందని తెలిపారు. పట్టుదల మరియు అంకితభావంతో చదువుకుంటే ఉన్నత అధిరోహించవచ్చని, జ్ఞాన సంపదను మించింది ఏది లేదని, కేవలం చదువల్లనే జ్ఞానం పెరుగుతుందని, మార్కులు తక్కువ వస్తే క్రుంగిపోకుండా పట్టుదలతో చాడాలే తప్ప ఎలాంటి ఆగాయిత్యాలకు పాల్పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి గూడెపు మాధవి, రాష్ట్రఅధ్యక్షురాలు ఏ. పద్మావతి, రాష్ట్ర కార్యదర్శి రాజగిరి,సిటీ సెక్రటరీ సంగీత, ఉదయ్, హేమంత్ హిమాన్షు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
హైదరాబాద్

ప్రముఖ కవి డా॥ ఎన్. గోపి
జన్మదినం సందర్భంగా
డా॥ ఎన్. గోపి రచించిన కవితా సంపుటి
'క్రియ ఒక జీవన లయ'
ఆవిష్కరణ - అంకితోత్సవం
తేది: ఆదివారం 25 జూన్, 2023, సాయంత్రం 6 గంటలకు
రవీంద్రభారతి సమావేశమందిరం (మొదటి అంతస్తు), హైదరాబాద్
ముఖ్యఅతిథి - ఆవిష్కర్త : శ్రీ కె. రామచంద్రమూర్తి, సీనియర్ పాత్రికేయులు
సభాధ్యక్షులు : డా॥ పోలేటి పార్వతీశం, ప్రముఖ సాహితీవేత్త
కృతి స్వీకర్త : శ్రీ కిల్లాడ సత్యనారాయణ, ఐ.పి.ఎస్., ప్రముఖ కవి, రచయిత, ఎ.డి.జి. ఉత్తర్‌ప్రదేశ్
విశిష్ట అతిథి : డా॥ మామిడి హరికృష్ణ, సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్రం
గౌరవ అతిథి : శ్రీ వంగల హర్షవర్ధన్, ప్రముఖ రచయిత, పూర్వ జాయింట్ కమీషనర్ (సి.టి.)
గ్రంథసమాలోచన : డా॥ ఎన్. రఘు, ప్రముఖ విమర్శకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉస్మానియా తెలుగు శాఖ
ఆత్మీయ అతిథి : శ్రీ కుడికాల వంశీధర్, ప్రముఖ కవి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు
మద్దాళి రఘురామ్ కార్యదర్శి

# సీఎం కేసీఆర్ టికెట్ ఇస్తే..తప్పక గెలిచి చూపిస్తా

**-ప్రజలను, పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటా**
**-చెన్నమనేనిపై చల్మెడ పరోక్ష విమర్శలు**
**-బీఆరెస్ బలోపేతం కోసమే ఆత్మీయ సమ్మేళనం**
**-బిఆర్ఎస్ సీనియర్ నేత, చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ అధినేత చల్మెడ లక్ష్మీనరసింహారావు**



రాజన్న సిరిసిల్ల, జూన్ 24:(నేటినిజం ప్రతినిధి): సీఎం కేసీఆర్ టిక్కెట్ ఇస్తే తప్పక గెలిచి చూపిస్తానని,ప్రజలను, పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటానని బిఆర్ఎస్ సీనియర్ నేత, చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ అధినేత చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శనివారంకోనరావుపేట మండలం ధర్మవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చెల్మడ లక్ష్మినరసింహారావు హాజరయ్యారు.

పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సమ్మేళనంలో దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో తను చేసే కార్యక్రమాలను బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసే ప్రక్రియ మాత్రమేనని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కోనరావుపేట మండలంలో మల్కపేట గ్రామంలో 3 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ ను నిర్మించడంతో మండలమంతా సస్యశ్యామలం అవుతుందని, యువతకు ఉద్యోగ కల్పన కోసం కేటీఆర్ ఎంతోగానో కృషి చేస్తున్నారని అన్నారు.తమ పార్టీ జెండా,ఎజెండా అంతా ఒకటేనని, తాను వేములవాడ ఎమ్మెల్యే టికెట్టు ఆశించడం తప్పు కాదని,ఒకవేళ అధిష్టానం తనను కాదని వేరే వారికి టికెట్ ఇచ్చిన వారిని ఓడిస్తానని చెప్పడం తప్పు అని అన్నారు. తనను కాదని అధిష్టానం వేములవాడ ఎమ్మెల్యే టికెట్ ను రమేష్ బాబుకు కేటాయించిన పార్టీ గెలుపు కోసం పని చేస్తానని పేర్కొన్నారు. తనకు ఈ ప్రాంతం కొత్త కావచ్చు కానీ,రాజకీయాలు కొత్త కాదని అన్నారు.2001 తెలంగాణ ఉద్యమ సమయంలో నుండి అనేక పోరాటాలు చేసిన ఈ ప్రాంత యువకులకు పార్టీలో సముచిత స్థానం దక్కలేదని తెలిపారు.

తనను నమ్ముకున్న కార్యకర్తలు అర్ధరాత్రి ఫోన్ చేసిన వారికి వెన్నుదన్నుగా నిలిచి కడుపులో పెట్టుకొని చూసుకుంటానని అన్నారు. ఇప్పటికే వేములవాడ నియోజకవర్గంలో తమ వైద్య విజ్ఞాన సంస్థ ద్వారా అందిస్తున్న అనేక సేవా కార్యక్రమాలను చూసి కొందరు ఓర్వలేక పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్ రావు, కొలనురు, కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్లు సంకినేని రామ్మోహన రావు,బండ నర్సయ్య,వేములవాడ కౌన్సిలర్ నిమ్మిశెట్టి విజయ్ం, మండలంలోని పలు సర్పంచులు, ఎంపిటిసిలు, భారస నాయకులు గజానందరావు, ముష్టం జీవన్ గౌడ్,ఆరె మహేందర్,బొజ్జ మల్లేశం,గున్నాల లక్ష్మణ్,గంగసాని రమణారెడ్డి,చక్రాల వేణు,మాందాల శ్రీనివాన్,జిన్న అనిల్, కసార్ల రాజు, గంట శ్రీనివాస్,నాగేందర్,సుంకటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవులకు క్రైస్తవ సమాజానికి బిజెపి అండ

**-బిజెపి నాయకులు మర్రి శశిధర్ రెడ్డి**

హైదరాబాద్ జూన్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); క్రైస్తవులకు క్రైస్తవ సమాజానికి మేము అండగా ఉంటామని వారి సమస్యలు అన్నిటినీ పరిష్కరించడానికి మేము ముందుంటామని మాజీ శాసనసభ్యులు మర్రి శశిధర్ రెడ్డి గారు తెలిపారు శనివారం నాడు సికింద్రాబాద్లో జరిగిన భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా క్రిస్టియన్స్ సువిదా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సమస్యలను క్రైస్తవులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను డిమాండ్లను ప్రధాని నరేంద్ర మోడీ మరియు అమిత్ షా గారి దృష్టికి తీసుకువెళ్లనట్లు ఆయన తెలిపారు అంతకుముందు క్రైస్తవ సంఘాల నాయకులు పాస్టర్లు బిషప్ లు మాట్లాడుతూ క్రైస్తవులు తమ కొరకు తమ ఇళ్ల కొరకు తమ ఆస్తుల కొరకు కాకుండా తమ పట్ల వేధింపులను అరికట్టాలని తాము కొనుక్కున్న స్థలాలలో చర్చి నిర్మాణం కొరకు అనుమతులు ఇవ్వాలని తాము చేపట్టే కార్యక్రమాలకు అడ్డంకులు కలిగించకుండా చూడాలని నియోజకవర్గానికి ఒక కమ్యూనిటీ హాలు మరియు చనిపోయిన వారి కొరకు సమాధుల తోటలను ఏర్పాటు



చేయాలని కోరారు అంతేకాకుండా తాము చేపడుతున్న సేవా కార్యక్రమాలకు సంబంధించిన ఎఫ్సీఆర్ఐ నిధులను అడ్డుకోకుండా చూడాలని కోరారు తామందరము భారతీయ జనతా పార్టీని అని కాకుండా భారతీయ జీసస్ పార్టీ అని మేము భావిస్తామని తెలిపారు అనంతరం రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చా అధ్యక్షులు అప్సరపాషా మాట్లాడుతూ క్రైస్తవులు సేవాగుణంలో ముందు ఉంటారని విద్యా వైద్యం విషయంలో వారు చేసిన సేవలు మరువరాని అని కొనియాడారు అంతేకాకుండా రాష్ట్రంలో క్రైస్తవ మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ గారు మరియు ప్రధానమంత్రి మోడీ గారి దృష్టికి తీసుకు వెళ్లడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి ముజీబ్ ఉపాధ్యక్షులు భరత్ రెడ్డి ఐజాక్ రాజ్ జూలీ శ్రీధర్ అబ్బాస్ సైదులు ఇండిపెండెంట్ చర్చెస్ అధ్యక్షులు బిషప్ దయానంద్ పాస్టర్ సుదర్శన్ పాస్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

# స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయాలి

**-బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా**
**-ఫేజ్-1 స్మార్ట్ సిటీ రోడ్ల పనులు పరిశీలన**



వరంగల్, జూన్ 24: స్మార్ట్ సిటీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా వరంగల్‌లో కొనసాగుతున్న ఫేజ్-1 అభివృద్ధి పనులను శుక్రవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంజీఎం జంక్షన్, గోపాలస్వామి గుడి ప్రాంతం, పోచమ్మ మైదాన్, వరంగల్ ఎస్‌బీఐ ఏరియా, వరంగల్ పోస్టాఫీస్ కూడలి, ఓ సిటీ ఏరియా, బాలా జీనగర్ జంక్షన్ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా ఫుట్‌పాత్‌లు, లైటింగ్, లేన్ మారింగ్ పనులతో పాటు మిగిలిన బీటీ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లు పనులను పూర్తి చేసేందుకు చొరవ చూపకపోతే ఇంజినీరింగ్ విభాగం ద్వారా పూర్తి చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు.


పోచమ్మమైదాన్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు మిగిలి పోయిన పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. వీటితో పాటు సర్వీస్ రోడ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. వరంగల్ పోస్టాఫీసు కూడలి ప్రాంతంలో ఫుట్‌పాత్ పనులను పూర్తి చేసి, డ్రైనేజీ నిర్మించి, దానిపైన కప్పు ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. పనులు నెమ్మదిగా నడుస్తున్నాయని, నెల రోజుల్లో పురోగతి కనిపించాలని స్పష్టం చేశారు. బాలాజీనగర్‌లో జంక్షన్ డ్రైనేజీ పనులకు అనుమతులు మంజూరైనందున తొందరగా పనులు ప్రారంభించాలన్నారు. స్ట్రోమ్ వాటర్ డ్రైన్ నిర్మాణంలో భాగంగా పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. వెంకట్రామ జంక్షన్ నుంచి ఓసిటీ వరకు విద్యుత్ స్తంభాల తరలింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఈఈలు శ్రీనివాస్, సంజయ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్యతో పాటు స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి పాల్గొన్నారు.

**నిబంధనలు పాటించాలి**

నిబంధనల మేరకు భవన నిర్మాణాలు చేపట్టాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. పెద్ద భవనాలు, నిర్మాణాల అనుమతి కోసం దరఖాస్తులు స్వీకరించిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు కమిషనర్ హనుమకొండలోని పలు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. నగరంలోని ప్రగతి నగర్ ఫేజ్-1, ఎన్ఐటీ దర్గా రోడ్డు, చైతన్యపురి కాలనీ, కేఎల్ఎన్ రెడ్డికాలనీ, మోర్ సూపర్ మారెట్ ప్రాంతం, సర్క్యూట్ హౌస్ రోడ్డు, అశోక కాలనీ, అలంకార్ జంక్షన్, కాపువాడ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి, దరఖాస్తులో నమోదు చేసిన సమాచారం, వాస్తవ స్థితిగతులను పరిశీలించారు. లోపాలు సవరించి నిర్మాణాలు చేసేలా చూడాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. కమిషనర్ వెంట సిటీ ప్లానర్ వెంకన్న, ఏఈఈ కిరణ్ ప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, గోలొండ శ్రీను ఉన్నారు.

**ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల తనిఖీ**

ఎనుమాముల మారెట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన తొలి దశ ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లను వరంగల్ తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూములలో కావాల్సిన సౌకర్యాలు ఉండేలా చూడాలని బల్దియా ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు శ్రీనివాస్, సంజయ్ కుమార్ పాల్గొన్నారు.




# బోథ్ ఎమ్మెల్యేకు తృటిలో తప్పిన ప్రమాదం..

ఆదిలాబాద్, జూన్ 24:: ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు తృటిలో ప్రమాదం తప్పింది. నిర్మల్ బైపాస్‌లో ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ఆవును ఢీకొట్టింది.

దీంతో ఎమ్మెల్యే కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది. ఎమ్మెల్యే బాపురావు చేతి వేళ్లకు తీవ్ర గాయమైంది. రక్తస్రావం కావడంతో.. ఎమ్మెల్యేను హుటాహు టిన చికిత్స నిమిత్తం మరో వాహనంలో ఆదిలాబాద్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే బాపు

# 36 ఏళ్లుగా కవల సోదరుడి పిండాన్ని మోసిన వ్యక్తి..

**- వైద్య శాస్త్రంలోనే అరుదైన ఘటన**

నాగ్‌పూర్ జూన్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మహారాష్ట్ర నాగ్‌పూర్ లో వైద్య శాస్త్రంలోనే అరుదైన ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. తనకు తెలియకుండానే తన కవల సోదరుడి పిండాన్ని 36 సంవత్సరాలపాటు కడుపులో మోశాడో వ్యక్తి. 1999లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను 'ది డైలీ స్టార్' పత్రిక తాజాగా తన కథనం ద్వారా వెల్లడించింది.నాగ్‌పూర్‌కు చెందిన సంజూ భగత్ 1963లో జన్మించారు. ఆయనకు 20 ఏళ్ల వయసు వచ్చేసరికి పొట్ట అసాధారణంగా పెరగడం ప్రారంభమైంది.

దాదాపు మూడు దశాబ్దాలకు పైగా సంజూ పొట్ట ఇలాగే ఉండటంతో.. అతన్ని ప్రెగ్నెంట్ మ్యాన్ (అంటూ స్థానికులు హేళన చేసేవాళ్లు. అయితే అవేవీ పట్టించుకోలేదు సంజూ. రాను రాను పొట్ట మరింత ఉబ్బెత్తుగా మారి, శ్వాస తీసుకోవడం కష్టం కావడంతో 1999లో ముంబైలోని ఓ ఆసుపత్రికి వెళ్లాడు.అక్కడ సంజూను పరిశీలించిన వైద్యులు అతని కడుపులో కణతి ఉందని, శస్త్ర చికిత్స చేయాలని చెప్పారు.

ఈ క్రమంలో ఆపరేషన్ సమయంలో పొట్టలో ఉన్నది చూశాకా వైద్యులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. సంజూ కడుపులోంచి మనిషి అవయవాలు ఒకటొకటిగా బయటకు రావడం మొదలు పెట్టాయి. 36 ఏళ్లుగా తన కవల సోదరుడి పిండం సంజూ భగత్ లో ఉన్నట్లు డాక్టర్ అజయ్ మెహతా తెలిపారు. దీన్ని వైద్య పరిభాషలో 'ఫీటస్ ఇన్ ఫీటు' (పిండంలో పిండం) అంటారని చెప్పారు. ఐదు లక్షల మందిలో ఒకరికి ఇలా జరిగే అవకాశం ఉందని డాక్టర్ మెహతా వివరించారు. కాగా, ప్రస్తుతం సంజూ భగత్ వయసు 60 ఏళ్లు.

# యూనివర్సిటీ విద్యార్థులకు ఆపిల్ బంపరాఫర్.. ఈ ఉత్పత్తులపై అక్టోబర్ 2 వరకూ డిస్కౌంట్ల వర్షం

న్యూఢిల్లీ, జూన్ 24: యూనివర్సిటీ విద్యార్థుల కోసం గ్లోబల్ టెక్ దిగ్గజం 'ఆపిల్' అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. 'బ్యాక్ టూ యూనివర్సిటీ 2023 క్యాంపెయిన్ ' కింద ఐ-పాడ్‌లు, మాక్ బుక్స్, డెస్క్ టాప్ కంప్యూటర్లపై డిస్కౌంట్ల వర్షం కురిపించింది.

ఐ-పాడ్ ప్రో (11-అంగుళాలు), ఐ-పాడ్ ప్రో (12.9- అంగుళాలు), ఐమాక్ (24-అంగుళాలు)లు డిస్కౌంట్ రేట్లపై అందుబాటులోకి తెచ్చింది. కస్టమర్లు సెలక్ట్ చేసుకున్న ప్రొడక్ట్సకనుగుణంగా ఎయిర్ పాడ్స్ ఉచితంగా అందజేయనున్నది. ఆపిల్ కేర్ + ప్లాన్ కింద విద్యార్థులకు 20 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ చానళ్లలో ఈ డిస్కౌంట్లు లభిస్తాయి. ఆపిల్ బీకేసీ , ఆపిల్ సాకెట్ , ఆపిల్ స్టోర్ ఆన్‌లైన్ స్టోర్లలో జూన్ 22 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు ఈ ఆఫర్లు చెల్లుబాటు అవుతాయి.

ఐపాడ్ ప్రోలపై ఇలా తగ్గింపు ధరలు

11-అంగుళాల ఐపాడ్ ప్రో అసలు ధర రూ.96,900 నుంచి రూ.76,900లకు, 12.9 అంగుళాల ఐపాడ్ ప్రో రూ.1,12,900 నుంచి రూ.1,02,900లకు అందిస్తోంది. ఐపాడ్ ఎయిర్ (తిఖజీట ఒతితీ) ధర రూ.59,900 కాగా, రూ.54,900లకు లభిస్తుంది. వీటితోపాటు సెకండ్ జనరేషన్ ఆపిల్ పెన్సిల్ ఉచితంగా అందిస్తున్నది.

మాక్ బుక్ ఎయిర్‌పై ఆఫర్లు ఇలా

13- అంగుళాల 'ఎం1-పవర్డ్ మాక్ బుక్ ఎయిర్ ' అసలు ధర రూ.99,900 కాగా, రూ.89,900లకు సొంతం చేసుకోవచ్చు. 13-అంగుళాల 'మాక్ బుక్ ఎయిర్ (ఎం2) ( రూ.1,29,900 నుంచి రూ.1,04,900 కాగా, 15-అంగుళాల (ఎం2) మాక్ బుక్ ఎయిర్ ' రూ.1,34,900 నుంచి రూ.1,24,900 లకు లభిస్తుంది.

మాక్ బుక్ ప్రోలపై ఇలా ధర తగ్గింపు

13- అంగుళాల మాక్ బుక్ ప్రో పై ఆపిల్ ఎడ్యుకేషన్ డిస్కౌంట్ రూ.1,29,900 నుంచి రూ.1,19,900, 14 -అంగుళాల మాక్ బుక్ ప్రో రూ.1,99,900 నుంచి రూ.1,84,900, 16-అంగుళాల మాక్ బుక్ రూ.2,49,900 నుంచి రూ.2,29,900లకు తగ్గించారు.

ఇలా ఐమాక్.. మాక్ మినీలపై తగ్గింపు

ఐపాడ్, మాక్ బుక్‌లతోపాటు ఐ-మ్యాక్ కంప్యూటర్ ధర రూ.1,29,900 కాగా, రూ.1,24,900లకు తగ్గించింది ఆపిల్. మాక్ మినీ (ఓజీఇ ఎతినితి) ధర రూ.59,900 నుంచి రూ.49,900లకు కుదించారు. మాక్ బుక్ ఎయిర్, మాక్ బుక్ ప్రో, ఐమాక్ 24 కొనుగోలు చేసే కస్టమర్లకు ఆపిల్ ఉచితంగా థర్డ్ జనరేషన్ ఎయిర్ పాడ్స్ అందజేస్తుంది. మాక్ మినీతో సెకండ్ జనరేషన్ ఎయిర్ పాడ్స్ పంపిణీ చేస్తుంది.

ఆపిల్ కేర్ + ప్లాన్స్ పైనా డిస్కౌంట్స్ ఇలా

ఐపాడ్, మాక్‌బుక్, ఐమాక్‌లతోపాటు విద్యార్థులకు ఆపిల్ కేర్+ ప్లాన్స్ మీద 20 శాతం డిస్కౌంట్ అందిస్తున్నది. దీంతోపాటు ఆపిల్ మ్యూజిక్, ఆపిల్ టీవీ + సబ్ స్క్రిప్షన్ మూడు నెలలు ఉచితంగా పొందొచ్చు. మూడు నెలల తర్వాత ప్రతి నెలా స్పెషల్ స్టూడెంట్ రేట్ కింద రూ.59లకు ఈ ప్లాన్లు లభిస్తాయి. యూనివర్సిటీ విద్యార్థులు, టీచర్లు, స్టాఫ్ కూడా ఆపిల్ ఉత్పత్తుల కొనుగోలు డిస్కౌంట్ పొందాలంటే.. ఆపిల్ వెబ్‌సైట్‌లో వారి అర్హతలు తెలియజేయాల్సి ఉంటుంది.

# గిరిజనుల దశాబ్దాల కల సాకారం.. పోడు సమస్యకు కేసీఆర్- శాశ్వత పరిష్కారం

హైదరాబాద్, జూన్ 24:అటవీ భూములను సాగు చేసుకుని బతుకుతున్న గిరి పుత్రులకే ఆ భూములపై హక్కులు కల్పిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. సీఎం ఆదేశాల మేరకు జూన్ 30వ తేదీ నుంచి పోడు పట్టాల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. అటవీ భూములపై ఆధారపడిన వారికి భూ యాజమాన్య హక్కులు కల్పించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని పేర్కొన్నారు. గతంలోనే దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం.. క్షేత్ర స్థాయిలో పరిశీలన పూర్తి చేసిందన్నారు. ఈ మేరకు అత్యధికంగా పోడు ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 151195 ఎకరాలకు గాను 50595 మంది గిరిజనులకు స్వయంగా మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ పట్టాలు అందించనున్నారని మంత్రి సత్యవతి వెల్లడించారు.

రెండో స్థానంలో అత్యధికంగా పోడు భూములున్న మహబూబాబాద్ జిల్లాలో 67730 ఎకరాలకు గాను 24181 మంది పోడు రైతులకు మంత్రులు కేటీఆర్, సత్యవతి రాథోడ్ పట్టాలు అందించనున్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 47138 ఎకరాలకు గాను 15519 మందికి ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా పోడు పట్టాలను అందించనున్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా అదే రోజు పోడు భూముల పట్టాలు నియోజకవర్గాల వారీగా కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు సమక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు అందించనున్నట్లు మంత్రి తెలిపారు.

ఆదిలాబాద్ లో 31683 ఎకరాలకు గాను 12222 పోడు రైతులకు పట్టాలు అందించనున్నారు. నిర్మల్ జిల్లాలో 20051 ఎకరాలకు 7275 పోడు రైతులు, ములుగు జిల్లాలో 18460 ఎకరాలకు గాను7129 మందికి, ఖమ్మంజిల్లాలో 12470 ఎకరాలకు గాను 6598 పోడు రైతులకు, కామారెడ్డి జిల్లాలో 11347 ఎకరాలకు 5015 మందికి, నిజామాబాద్ 8611 ఎకరాలకు 4229 మందికి పట్టాలు అందించనున్నారు. వరంగల్ 73333 ఎకరాలకు గాను 4271 మందికి , మరియు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8088 ఎకరాలకు గాను 3250 పోడు రైతులకు పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నల్గొండ జిల్లాలో 5578 ఎకరాలకు గాను 2928 పోడు రైతులకు, మంచిర్యాల జిల్లా 5024 ఎకరాలకు గాను 2403 పోడు రైతులకు, నాగర్ కర్నూలు జిల్లాలో 5056 ఎకరాలకు గాను 1973 మంది పోడు రైతులకు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2859 ఎకరాల గాను 1614 పోడు రైతులకు, సంగారెడ్డి జిల్లాలో 1808 ఎకరాల గాను 1127 పోడు రైతులకు, మెదక్ జిల్లాలో 525ఎకరాలకు గాను 610 పోడు రైతులకు, వికారాబాద్ జిల్లాలో 553 ఎకరాలకు గాను 436 పోడు రైతులకు వనపర్తి జిల్లాలో 455 ఎకరాలకు గాను 389 పోడు రైతులకు పట్టాలు అందననున్నాయి.యాదాద్రి భువనగిరి జిల్లాలో213 ఎకరాల గాను 205 పోడు రైతులకు, సూర్యాపేట జిల్లా 84 ఎకరాలకు గాను 84 పోడు రైతులకు, హనుమకొండ జిల్లాలో 65 ఎకరాలకు గాను 70 పోడు రైతులకు, మహబూబ్ నగర్ జిల్లాలో 13 ఎకరాలకు గాను 19 పోడు రైతులకు, జగిత్యాల జిల్లాలో20 ఎకరాల గాను 15 పోడు రైతులకు, పెద్దపల్లి జిల్లాలో 2 ఎకరాల గాను 4 పోడు రైతులకు, నారాయణపేట జిల్లాలో 8 ఎకరాలకు గాను 3 మూడు రైతులకు పట్టాలను అందించనున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ తెలియజేశారు. వీరికి పట్టాలు ఇవ్వనుండడంతో రైతుబంధు, రైతుబీమా పథకాలు వర్తించనునాయని మంత్రి సత్యవతి పేర్కొన్నారు. కొత్తగా పోడు పట్టాలు పొందిన వారికి రైతుబంధు పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే బ్యాంకు ఖాతాలను తెరిచి, పోడు పట్టాల యాజమానులకు నేరుగా రైతుబంధును జమ చేస్తామని మంత్రి తెలిపారు.

# అమెరికాలోని భారత సంతతి సభ్యులతో ప్రధాని సంభాషణ

నాడు పోస్టు చేయడమైనది: 24 ఏజఔ 2023 7:30ఒ ఎం ఖఏః ఊఎటవతీజీఎజీట

ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ జూన్ 23న వాషింగ్టన్ డీసీ లోని రోనాల్డ్ రీగన్ సెంటర్ లో భారత సంతతి సభ్యులతో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, అమెరికాలో వివిధ రంగాలలో భారత సంతతి ప్రజలు సాధిస్తున్న విజయాలను అభినందించారు. భారతదేశంలో ప్రస్తుతం సాగుతున్న అమృత కాలంలో దేశ అభివృద్ధికి తమ వంతు సాయం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. భారత్-అమెరికా సంబంధాలను పటిష్టపరచటంలో వారు పోషిస్తున్న పాత్రకు ప్రధాని ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో ఐ రంగాలలో ద్వైపాక్షిక భాగస్వామ్యాలకు అవకాశం ఉందో వివరించారు.

# జమ్మూ కాశ్మీర్ సాహసవంతులు, ధైర్యశాలుల భూమి, దేశ సేవలో అమరులైన వారి జ్ఞాపకార్థం బలిదాన స్థూపం నిర్మాణం.. .




న్యూఢిల్లీ, జూన్ 24:జమ్మూ కాశ్మీర్ పర్యటన రెండో రోజునలో భాగంగా కేంద్ర హోం, సహకార మంత్రి శాఖ శ్రీ అమిత్ షా ఈ రోజు శ్రీనగర్‌లో బలిదాన్ స్తంభానికి శంకుస్థాపన చేశారు. శ్రీ షా జమ్మూ కాశ్మీర్ పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశమై వారికి నియామక పత్రాలు అందజేశారు. దీనికి సంబంధించి ట్వీట్ చేసిన శ్రీ అమిత్ షా " దేశ ధైర్యసాహసాలు, శౌర్యానికి పుట్టినిల్లు జమ్మూ కాశ్మీర్. అమర వీరుల పరాక్రమాన్ని,త్యాగాన్ని చిరస్థాయిగా నిలిపేందుకు ఈరోజు శ్రీనగర్‌లోని ప్రతాప్ పార్కులో ' బలిదాన స్థూపం' నిర్మాణానికి శంకుస్థాపన చేసాను.బలిదాన స్థూపం అమరవీరుల స్మృతి ని చిరస్థాయిగా నిలిపి యువతలో దేశభక్తిని ప్రేరేపిస్తుంది' అని పేర్కొన్నారు.

"ఉగ్రవాదులతో పోరాడుతూ అమాయక ప్రజల ప్రాణాలకు భద్రత కల్పిస్తూ తమ ప్రాణాలను అర్పించిన జమ్మూ కాశ్మీర్ పోలీసు సిబ్బంది తయాగం కలకాలం గుర్తుంటుంది. కాశ్మీర్ మరియు ప్రజలు శాంతికి కట్టుబడి ఉన్నారనడానికి నిదర్శనం. ఈ రోజు శ్రీనగర్‌లో అమరవీరుల కుటుంబ సభ్యులను కలుసుకున్నాను. అమరవీరుల సన్నిహిత బంధువులకు జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం తరపున నియామక పత్రాలు అందజేసాను' అని శ్రీ అమిత్ షా తెలిపారు.

# ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం



రాజన్న సిరిసిల్ల, జూన్ 24:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని బ్రిడ్జి వద్ద ఎమ్మెల్సీపాడి కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మను ముదిరాజ్ కులస్థులు దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు, పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పిల్లి మధు మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం హుజూరాబాద్ లో జరిగిన సంఘటనను వేములవాడ పట్టణ ముదిరాజ్ సంఘం తరుపున తీవ్రంగా ఖండిస్తున్నారు.కౌశికరెడ్డి బూతులు మాటలను విని తెలంగాణ ప్రజల సిగ్గుపడుతున్నారనో, తెలంగాణ అమరవీరుల స్థూపం కూల్చివేత తెలంగాణ ద్రోహుల చర్యగా తెలంగాణ ప్రజలు భావిస్తున్నారన్నారు.

సభ్య సమాజం సిగ్గు పడేలా మాట్లాడటం ఆ బూతులు వినే వాళ్లకు సిగ్గుగా ఉందన్నారు. ముదిరాజుల జోలికొస్తే మాడి మసై పోతావని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలోఒక చీడపురుగు కౌశిక్ రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించాలని అన్నారు. అలాగే యావత్ ముదిరాజ్ లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రములో రేగుల మల్లికార్జున్, రేగుల సంతోష్ బాబు, చెన్నవేణి శ్రీనివాస్జ ఏదుల అశోక్ రేగుల రాజ్ కుమార్జ కొక్కు గోపాల కృష్ణ, చిక్కుడు మల్లేశం, పిల్లి శ్రీనివాస్, సిద్దార్ధ, రేగుల దేవేందర్, రెడ్డవేణి మోహన్, లాల కిరణ్, పిల్లి శేఖర్, గొట్టం దేవయ్య, గొట్టం శ్రీను, రేగుల లక్ష్మణ్ కుల సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో లక్ష్య సాధనకు శ్రమించాలి

**–గురుకుల విద్యాలయాల సంస్థ విశ్రాంత డిప్యూటీ కార్యదర్శి కె. వెంకటనర్సయ్య ఉద్బోధ**

చౌటుప్పల్, జూన్ 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);విద్యార్థులు లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో శ్రమించాలని తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ విశ్రాంత డిప్యూటీ కార్యదర్శి కె. వెంకటనర్సయ్య ఉద్బోధించారు. చౌటుప్పల్లోని కేజీబీవీ విద్యార్థిని వై. అక్షయ తన ఆశయమైన ఐ ఏ ఎస్ సాదించేందుకు పీవీఎస్ వీజీ ఫౌండేషన్ రూ.40 వేల ఆర్థిక సాయాన్ని ఆయన చేతులమీ దుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను దాతలు ప్రోత్స హించాలని కోరారు. ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళిగౌడ్, కేజీబీవీ ప్రత్యే కాధికారిణి కె. భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అత్యుత్తమ విద్యనందించడంలో అల్ఫోర్స్ అగ్రగామిగా నిలబడుతుంది

**–అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి నరేందర్ రెడ్డి**

కరీంనగర్, జూన్ 24: (నేటినిజం ప్రతినిధి): విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందించడంలో అల్ఫోర్స్ విద్యాసంస్థలు అగ్రగామిగా ఉంటాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా?వి.నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్ లోని స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైని టాట్స్ ప్రాంగణంలో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు బిట్సాట్లో అత్యుత్తమ మార్కులను సాధించినందుకు ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడురు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅల్ఫోర్స్ విద్యార్థులకు కావలసిన నదుపాయాలను అందజేస్తున్నదని, ఉత్తమమైన భోదనను ఇస్తుందని అన్నారి. భవిష్యత్తులో మరిన్ని విజయాలను నమోదు చేసి చరిత్ర సృష్టించాలని సూచించారు. ఇటీవల కాలంలో నిర్వహింపబడిన బిట్సాట్లో అద్భుతమైన ఫలితాలు సాధించడం జరిగినదని చెప్పారు. బిటీసాట్ కళాశాలలకు చెందిన యల్. సాయితేజ-243 మార్కులు, డి. శ్రీసదన్-242 మార్కులు, ఆర్. సుహాసిత-237 మార్కులు, ఆర్. అభిఘ్న రెడ్డి-233 మార్కులు, కె. సాయి సహస్ర-230 మార్కులు, నిషాంత్ పార్వాల్ -228 మార్కులు, టి. అనుదీప్-225 మార్కులు, కుష్ లాహోటి 219 మార్కులు, తదితరులు చాలా ప్రశంసనీయమైన మార్కులు సాధించడం చాలా గర్వించదగ్గ విషయమని అన్నారు.

పలు జాతీయ స్థాయి పరీక్షలలో విజయపరంపరను చాలా గొప్పగా కొనసాగిస్తున్నందకు విద్యార్థుల తల్లిదండ్రులకుప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

విజేతలందరికి పుష్పగుచ్చాలను అందజేసి, భవిష్యత్లో మరిన్ని సంచలనాత్మక ఫలితాలను నమోదు చేసి ఆదర్శనీయంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒమన్‌లో ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు..జాగృతి, బీఆర్ఎస్ ఎన్నారై శాఖల ఆధ్వర్యంలో రక్తదానం

హైదరాబాద్, జూన్ 24:తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఒమన్ దేశ రాజధాని మస్కట్‌లోని ఘలాలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ రాయల్ హాస్పిటల్ లోని సెంట్రల్ బ్లడ్ బ్యాంక్‌లో భారత జాగృతి, బీఆర్ఎస్ ఎన్నారై సెల్ శాఖల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

ఈ శిబిరంలో తెలంగాణ, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ను ఉత్సాహంగా నిర్వహించారు.

భారత జాగృతి ఒమాన్ శాఖ అధ్యక్షుడు గుండు రాజేందర్ నేత, బీఆర్ఎస్ఎన్ఆర్ఐ సెల్ ఒమాన్ అధ్యక్షుడు ఈగపురి మహిపాల్ రెడ్డి, భారత్ జాగృతి ఒమాన్ కో కన్వీనర్ బైసింగరవు వినోద్ యాదవ్, బీఆర్ఎస్ ఒమాన్ ప్రధాన కార్యదర్శులు గాంధారి నరేష్, భాస్కర్ రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ రామరాజు, కరుణాకర్ పాల్గొన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సాయి రాజు, రాజేందర్, వంశీ, రంజిత్, ప్రమోద్ రెడ్డి, విజయ్,మెడ పట్ల లక్ష్మణ్ ,జగన్,కొయ్యాడి వంశీ ,మంత్రి గోపాల్ ,రంజిత్ కశామొల్ల, కొము రయ్య,వేణు,రాజు, నరేష్ ,రాజేందర్,రంజిత్,శ్రీనివాస్ నేత, అక్తర్,జంబుకా శ్రీనివాస్, గంగాధర్, ప్రదీప్, సుమన్,నాగరాజు,అశోక్ తదితరులు పాల్గొని రక్తదానం చేశారు.

# మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**–సాదిక్ సఫియా ఫౌండేషన్ అధ్యక్షులు సయ్యద్ రసూల్ విజ్ఞప్తి**



రాజన్న సిరిసిల్ల, జూన్ 24:(నేటినిజం ప్రతినిధి): మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సాదిక్ సఫియా ఫౌండేషన్ అధ్యక్షులు సయ్యద్ రసూల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సర్వజనులతో పాటు మైనారిటీలు సైతం పెద్ద ఎత్తున పాలు పంచుకున్నారని, తమ ప్రాణాలకు లెక్కచేయకుండా ప్రాణ త్యాగ్యాలు చేశారని అన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు కాలేదని తెలిపారు.

దాదాపుగా 9 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా నిలబెట్టకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

12 శాతం రిజర్వేషన్ కేంద్రానికి పంపినామని చేతులు దులుపుకోవడం

సిగ్గు చేటన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కు పోస్ట్ కార్డ్, మెయిల్ ద్వారా పోస్ట్ చేశామని తెలిపారు. ముస్లింలకు కూడా దళిత ముస్లిం బంధువు లాంటి పథకాలు అమలు చేయాలని, సబ్సిడీ కొరకు అప్లై వేసుకున్న ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు చేయాలని తెలిపారు.

మైనారిటీల కొరకు ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని కోరారు. రంజాన్ మాసంలోనే ప్రభుత్వానికి ముస్లింలు గుర్తుకు వస్తారని, ఇఫ్తార్ కావో.. సబ్ కుచ్ బుల్జావో అన్నట్టు ఇంతవరకే పరిమితం చేస్తారని తెలిపారు. శాసనసభ ఎన్నికలు రాకముందే ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, అలాగే మున్సిపల్ ఎన్నికలలో ఎంపీటీసీ, జడ్పిటిసి, వివిధ నామినేట్ పదవులలో ఎక్కువ శాతం మైనార్టీ ముస్లింలకు నియమించాలని కోరారు. ముస్లింల సమస్యలను నెరవేర్చే పార్టీలకే ఓటు వేసే విధంగా ముస్లిం సంఘాలు ఒక్కటి కావాలని తెలిపారు. ముస్లిం డెకరేషన్ రూపకల్పన కోసం చలో హైదరాబాద్ 25 జూన్ ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని, ముస్లింల హక్కుల, బాధ్యతయుతమైన డిక్లరేషన్ను కొరకు తెలంగాణ ముస్లిం సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ద్వారా రూపొందించుకుందామని, మన హక్కుల్ని సాధించుకుందామని పిలుపునిచ్చారు.

# తెలుగుదేశం హయాంలోనే చేనేత రంగం అభివృద్ధి

**–సిరిసిల్ల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ ఆవునూరి దయాకర్ రావు**



రాజన్న సిరిసిల్ల, జూన్ 24:(నేటినిజం ప్రతినిధి): తెలుగుదేశం హయాంలోనేచేనేత రంగం అభివృద్ధి జరిగిందని సిరిసిల్ల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ ఆవునూరి దయాకర్ రావు అన్నారు.

సిరిసిల్ల పట్టణంలో శనివారం తెలుగుదేశం పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి ఆవునూరి దయాకర్ రావు చేనేత విభాగం కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షుడు కల్లపెల్లి సంతోష్ తో కలిసి మాట్లాడారు. ఆనాడు తెలుగుదేశం పార్టీ హయాంలోనే చేనేత విభాగం అభివృద్ధి జరిగింది అని, స్వర్గీయ నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, జనతా వస్త్రాలు పంపిణీ చేనేత రంగానికి ఇచ్చి నేత బట్టలను చేనేతను ప్రోత్సహించిన విషయం గుర్తుచేశారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత చేనేత రంగం అభివృద్ధి కోసం ఇక్కడి కార్మికుల బాగుకోసము ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో టెక్స్టైల్ పార్కులను ఏర్పాటు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కిందన్నారు. ఆనాడు జిల్లాకి ఒకటి నేత బజార్ పెట్టి జీవనోపాధి కల్పించిన ఘనత కూడా తెలుగుదేశం హయాంలోనే జరిగిందని పేర్కొన్నారు. అలాగే సిరిసిల్ల నేతన్నలకు ఆనాడు 50 శాతం కరెంటు సబ్సిడీని ఇచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కినదని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ చీరల పనులను పూర్తిస్థాయిలో ఇక్కడి చేనేత కార్మికులకు ఇవ్వకుండా పొరుగు రాష్ట్రాల నుంచి నాసిరకం చీరలను దిగుమతి చేసుకొని ఇక్కడి చేనేత కార్మికుల పొట్టలను కొట్టాడని, బతుకమ్మ చీరల విషయంలో ఆసాముల జేబులు నిండాయే తప్ప చేనేత కార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వ పాఠశాల, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు యూనిఫాములను ఇక్కడి కార్మికులకు అప్పగించకుండా చేనేత కార్మికులను మోసం చేసిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు తీగల శేఖర్ గౌడ్, చేనేత విభాగం కరీంనగర్ పార్లమెంట్ అధ్యక్షులు కల్లపెల్లి సంతోష్, పట్టణ ఉపాధ్యక్షులు ఇరుకుల్ల భాస్కర్, పార్లమెంట్ నాయకులు మాలోత్ సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలోని ప్రముఖ వృత్తినిపుణులతో ప్రధాని ముఖాముఖి

న్యూఢిల్లీ, జూన్ 24:ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ జూన్ 23 న వాషింగ్టన్ డీసీ లోని జాన్ ఎఫ్ కెన్నడీ సెంటర్ లో అమెరికా వృత్తినిపుణులతో భేటీ జరిపి వారితో సంభాషించారు. అమెరికా-భారత వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అమెరికా మంత్రి ఆంటోనీ బ్లింకెన్ కూడా పాల్గొన్నారు.

భారతదేశంలో ప్రస్తుతం సాగుతున్న గణనీయమైన మార్పును, వివిధ రంగాలలో సాధిస్తున్న ప్రగతిని ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదే సరైన సమయమని గుర్తు చేస్తూ, వృత్తి నిపుణులు భారత భాగస్వామ్యానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన 1000 మందికి పైగా వృత్తి నిపుణులు హాజరయ్యారు.

# మహిళా బస్సు డ్రైవర్‌ను సత్కరించిన ఎంపీ.. ఆ తర్వాత విధుల నుంచి ఆమెను తొలగింపు!



చెన్నై, జూన్ 24:ఎంతో నైపుణ్యంతో బస్సు నడుపుతున్న మహిళా డ్రైవర్‌ను (ఆ లినీఎజీని ఎబీబ టతీతిలవతీ) ఒక ఎంపీ సత్కరించారు. అయితే కొన్ని గంటల తర్వాత ఆ మహిళా డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ విషయం తెలిసి అంతా ఆశ్చర్యపోయారు. తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ సంఘటన జరిగింది. 23 ఏళ్ల షర్మిల ఒక ప్రైవేట్ బస్సులో డ్రైవర్‌గా పని చేస్తున్నది. ప్రముఖుల నుంచి ప్రశంసలను కూడా ఆమె అందుకున్నది. కోయంబత్తూర్ దక్షిణ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ ఇటీవల షర్మిల డ్రైవ్ చేసిన ఆ ప్రైవేట్ బస్సులో ప్రయాణించారు. తాజాగా డీఎంకే ఎంపీ, ఆ పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి కనిమొళి కూడా గాంధీపురం నుంచి పీలమేడు వరకు షర్మిల నడిపి బస్సులో శుక్రవారం ప్రయాణించారు. అనంతరం ఆ యువతి డ్రైవింగ్ నైపుణ్యాన్ని, ధైర్యాన్ని మెచ్చుకున్నారు. ప్రైవేట్ బస్సు డ్రైవర్ అయిన తండ్రి సమక్షంలో షర్మిలను ఎంపీ కనిమొళి సత్కరించారు. చేతి వాచీని ఆమెకు బహుకరించారు.

కాగా, ఈ సంఘటన జరిగిన కొన్ని గంటల తర్వాత ఉద్యోగం నుంచి తనను తొలగించారని మహిళా బస్సు డ్రైవర్ షర్మిల ఆరోపించింది. ఎంపీ కనిమొళి బస్సులో ప్రయాణించిన సందర్భంగా ఆమె పట్ల ఒక మహిళ దురుసుగా ప్రవర్తించగా అడ్డుకోని కండక్టర్‌పై బస్సు యజమానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. అయితే సొంత పబ్లిసిటీ కోసం ప్రముఖ వ్యక్తులను బస్సులోకి ఎక్కిస్తున్నట్లు యజమాని తనను తిట్టినట్లు చెప్పింది. అలాగే ఉద్యోగం నుంచి వెళ్లిపొమ్మని చెప్పారని, బస్సు మేనేజర్ కూడా తన తండ్రి పట్ల అసభ్యంగా మాట్లడినట్లు షర్మిల ఆరోపించింది. మరోవైపు షర్మిలను ఉద్యోగం నుంచి తొలగించినట్లు వచ్చిన వార్తలను ప్రైవేట్ బస్సు యాజమాన్యం ఖండించింది.

# అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



రాజన్న సిరిసిల్ల, జూన్ 24:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో అంగన్వాడీ రెండవ కేంద్రంలో చిన్నారులకు శనివారం అక్షరాభ్యాసం నిర్వహించారు, గ్రామ సర్పంచి న్యాత విజయ-జార్జ్ చిన్నారులచే అక్షర బ్యాసాన్ని చేయించారు, ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులు అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకునే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలి అన్నారు, అలాగే అంగన్వాడి మొదటి కేంద్రంలో చిన్నారులకు అన్నప్రసాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు బుర్ర రేణుక, న్యాత పద్మ ఆరోగ్య సిబ్బంది వసంత, రమణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భారత్‌లో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు.. చిన్న వ్యాపారాలు డిజిటలైజ్ చేస్తామన్న అమెజాన్..!

న్యూఢిల్లీ, జూన్ 24: భారత్‌లో అదనంగా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఈ-కామర్స్ జెయింట్ అమెజాన్ వెల్లడించింది. 2030 నాటికి భారత్‌లోని అన్ని బిజినెస్‌ల్లో 26 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీ తెలిపారు. ఇండియాలోని స్టార్టప్‌లు, ఉద్యోగాల కల్పనకు, ఎగుమతులకు ప్రోత్సాహం, డిజిటలైజేషన్, ప్రపంచవ్యాప్తంగా చిన్న వ్యాపారాలు పోటీ పడేలా మద్దతు ఇస్తామని చెప్పారు.

అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీతో టెక్ దిగ్గజాల సీఈఓలు సమావేశమయ్యారు. ఈ సమావేశం తర్వాత అమెజాన్ బ్లాగ్‌పోస్ట్‌లో భారత్ లో భవిష్యత్ పెట్టుబడి ప్రణాళికలను ఆండీ జస్సీ బయటపెట్టారు. 2030 నాటికి అమెజాన్ క్లౌడ్ కంప్యూటింగ్ యూనిట్ అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) రూ.1.09 లక్షల కోట్ల (12.9 బిలియన్ డాలర్లు) పెట్టుబడులకు ఇది అదనం కానున్నది.

భారత్‌లో కోటి చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేయడానికి అమెజాన్ చర్యలు తీసుకుంటుందని ఆండీ జస్సీ తెలిపారు. వచ్చే రెండేండ్లలో భారత్ నుంచి విదేశాలకు 20 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి చేస్తామని, కొత్తగా 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు భారత్‌లో 13 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు గుర్తు చేశారు.

గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గ్లోబల్ ఫిన్ టెక్ ఆపరేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీతో భేటీలో గూగుల్ సీఈఓ సుందర్ పిచ్చాయ్ వెల్లడించారు. అయితే, దీనిపై పూర్తి వెల్లడించడానికి గూగుల్ అధికార ప్రతినిధి అందుబాటులోకి రాలేదు.




# క్రిష్ణవేణి స్కూల్‌లో ఘనంగా కృష్ణమ్మ ఒడిలో గోరింటాకు వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జూన్ 24: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ప్రైమరీ నుండి హైస్కూల్ వరకు విద్యార్థినిలు ఆషాఢంలో జరు పుకునే కృష్ణమ్మ ఒడిలో గోరింటాకు వేడుకలు శనివారం ఘనంగా జరు పుకున్నారు. ఈ సందర్భంగా చేతిలో అలంకార ప్రాయమైన గోరింటాకుతో పిల్లలందరు అలంకరించుకొని గోరింటాకు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ గోరింటాకు ప్రాముఖ్యత గురించి తెలిపారు. సాంస్కృతి, సాంప్రదాయాల గురించి వివరించారు.

# అమెరికాలోని భారత సంతతి సభ్యులతో ప్రధాని సంభాషణ

న్యూఢిల్లీ, జూన్ 24:ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ జూన్ 23న వాషింగ్టన్ డీసీ లోని రోనాల్డ్ రీగన్ సెంటర్ లో భారత సంతతి సభ్యులతో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, అమెరికాలో వివిధ రంగాలలో భారత సంతతి ప్రజలు సాధిస్తున్న విజయాలను అభినందించారు.

భారతదేశంలో ప్రస్తుతం సాగుతున్న అమృత కాలంలో దేశ అభివృద్ధికి తమ వంతు సాయం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. భారత్-అమెరికా సంబంధాలను పటిష్టపరచటంలో వారు పోషిస్తున్న పాత్రకు ప్రధాని ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో ఐ రంగాలలో ద్వైపాక్షిక భాగస్వామ్యాలకు అవకాశం ఉందో వివరించారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.